
సాక్షి
బాపట్ల

శుక్రవారం । 26 । ఏప్రిల్ । 2024



పరంజ్యోతి కల్కి ఆలయ ప్రతిష్టాపన

తెనాలి: పరంజ్యోతి సేవాసంఘం ఆధ్వర్యంలో రూరల్ మండలం బుర్రిపాలెం వద్ద నూతనంగా వరసిద్ధి శ్రీపరంజ్యోతి కల్కి ఆలయ ప్రతిష్టాపన మహోత్సవం గురువారం ఘనంగా జరిగింది.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం గురువారం 505.70 అడుగుల వద్ద ఉంది. ఎస్ఎల్‌బీసీకి 800 క్యూసెక్కులు విడుదలవుతోంది.



ద్వాదశ ప్రదక్షిణలు

ఇంద్రకీలాద్రి: చైత్రమాస బ్రహ్మోత్సవాల ముగింపును పురస్కరించుకుని ఇంద్రకీలాద్రిపై దుర్గా మల్లేశ్వరస్వామి వార్ల పవళింపు సేవ గురువారం నిర్వహించారు.

న్యూస్‌రీల్

ఎన్నికల విధుల్లో అశ్రద్ధ వద్దు



బాపట్ల టౌన్: సార్వత్రిక ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలని పార్లమెంట్ పరిశీలకులు కెప్టెన్ ఎం.ఎ. అయ్యప్ప తెలిపారు. పార్లమెంట్ పోలీస్ పరిశీలకులుగా నియమితులైన ఆయన గురువారం జిల్లా ఎస్పీ క్యాంప్ కార్యాలయానికి చేరుకున్నారు. ఎస్పీ వకుల్ జిందాల్, అడిషనల్ ఎస్పీలు పుష్పగుచ్ఛాలు అందించి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా అయ్యప్ప మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ నిబంధనలకు అనుగుణంగా ప్రతి ఒక్కరు నడుచుకోవాలని తెలిపారు. శాంతిభద్రతల సమస్యలు తలెత్తకుండా, సమర్థంగా ఎన్నికలు నిర్వహించాలని చెప్పారు. తొలుత భద్రతాపరమైన ఏర్పాట్లు, మద్యం, నగదు, ఇతర వస్తువుల అక్రమ రవాణాను కట్టడి చేయడానికి తీసుకుంటున్న చర్యల గురించి అడిగి తెలుసుకున్నారు.

శరవేగంగా అభయాంజనేయ స్వామి మండప నిర్మాణం



తాడేపల్లి రూరల్: సీతానగరం విజయకీలాద్రి దివ్యక్షేత్రంపై ఏర్పాటు చేయనున్న ఏకశిలా అభయాంజనేయస్వామి మండప నిర్మాణపనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఈ సందర్భంగా జీయర్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ నిర్వాహకులు పురాణం వెంకటాచార్యులు మాట్లాడుతూ త్రిదండి చిన రామానుజ జీయర్‌స్వామి మంగళాశాసనాలతో విజయకీలాద్రి దివ్యక్షేత్రంపై ఏర్పాటు చేయనున్న ఏకశిలా అభయాంజనేయస్వామి వారి విగ్రహానికి మండప నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నాయని తెలిపారు. మండపనిర్మాణ పనులలో భాగంగా శ్లాబ్ పనులు గురువారం నుంచి ప్రారంభించామని, త్వరలోనే అభయాంజనేయస్వామి భక్తులతో పూజలు అందుకోబోతున్నారని వివరించారు. కార్యక్రమంలో గుదిమెల్ల రఘునాథ్, నారాయణ, ఆలయ అర్చక బృందం, జీయర్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ వేద విద్యార్థులు పాల్గొన్నారు.

టీడీపీ ప్రచారంలో ప్రభుత్వ ఉపాధ్యాయుడు



నరసరావుపేట రూరల్: ప్రభుత్వ ఉపాధ్యాయుడు రాజకీయ నాయకుడి అవతారం ఎత్తాడు. పసుపు కండువా కప్పుకుని రాజకీయం చేస్తున్నాడు. పేరుకే ప్రభుత్వ ఉపాధ్యాయుడే గానీ మండలంలోని పెట్లూరివారి పాలెంలో టీడీపీ పెత్తనం అంతా ఇతనే చేస్తున్నాడు. టీడీపీ ఆధ్వర్యంలో గ్రామంలో నిర్వహించిన ప్రచార ర్యాలీలో పాల్గొంటున్నాడు. గ్రామానికి చెందిన తిరుమలశెట్టి శ్రీనివాసరావు నాదెండ్ల మండలం కోమటినేనివారి పాలెం గ్రామంలోని జెడ్పీ హైస్కూల్‌లో హిందీ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నాడు. గ్రామంలో ఇటీవల నిర్వహించిన టీడీపీ ప్రచారంలో నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ అరవింద్‌బాబు, మాజీ మంత్రి కన్నా లక్ష్మీనారాయణ పాల్గొన్నారు. కార్యక్రమంలో శ్రీనివాసరావు పాల్గొన్నాడు. నిబంధనలకు విరుద్ధంగా పార్టీ ప్రచార కార్యక్రమంలో పాల్గొన్న అతడిపై అధికారులు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

సాగర్ కుడి కాలువకు నీటి నిలుపుదల

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ ప్రాజెక్టు కుడికాలువకు గురువారం నీటిని నిలుపుదల చేశారు. కుడికాలువ పరిధిలోని గుంటూరు, పల్నాడు, బాపట్ల, ప్రకాశం జిల్లాలకు తాగునీటి అవసరాల నిమిత్తం ఈనెల 8న కృష్ణా యాజమాన్య బోర్డు 8టీఎంసీల నీటిని కేటాయించింది. నీటి విడుదల పూర్తవ్వడంతో కేఆర్ఎంబీ ఈఈ రఘునందన్ సమక్షంలో ఉదయం 8.30గంటలకు గంటకు 1,000 క్యూసెక్కుల చొప్పున తగ్గిస్తూ మధ్యాహ్నం 12 గంటలకు కుడికాలువ నుంచి విడుదలవుతున్న నీటిని పూర్తిగా నిలిపివేశారు. ప్రస్తుతం సాగర్ జలాశయ నీటి మట్టం 505.70 అడుగుల వద్ద ఉంది.

జనం జనం.. ప్రభంజనం

- అసెంబ్లీ అభ్యర్థి వరికూటి వెంట నడచిన వేమూరు ప్రజలు
- అట్టహాసంగా నామినేషన్
- జన సంద్రంతో కిక్కిరిసిన రోడ్లు
- స్వచ్ఛందంగా తరలివచ్చిన ప్రజలు



కొల్లూరు గాంధీనగర్ నుంచి భారీ ప్రదర్శనగా వెళ్తున్న వేమూరు ఎమ్మెల్యే అభ్యర్థి వరికూటి

కొల్లూరు / వేమూరు/ భట్టిప్రోలు : వేమూరు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి వరికూటి అశోక్‌బాబు నామినేషన్ దాఖలు కార్యక్రమానికి ప్రజలు వెల్లువ తరలివచ్చారు. వరదై పోటెత్తి జన సంద్రాన్ని తలపించారు. వేలాదిగా తరలి వచ్చిన భారీ జనసందోహంతో కలసి కొల్లూరు ఇందిరానగర్ ఎస్టీ కాలనీ నుంచి గురువారం అశోక్‌బాబు నామినేషన్ దాఖలు చేయడానికి వేమూరు ఆర్వో కార్యాలయానికి తరలివెళ్లారు. నేల ఈనిందా అన్నట్లు స్వచ్ఛందంగా తరలివచ్చిన వైఎస్సార్ సీపీ అభిమానులు, కార్యకర్తలు, నాయకులతో కలసి ఆయన కొల్లూరులో పాదయాత్ర ద్వారా ప్రజల్ని కలుపుకుంటూ నామినేషన్ పత్రాలు సమర్పించేందుకు వెళ్లారు. రహదారులు కిక్కిరిసి పోయేలా తరలివచ్చిన అభిమానుల కోలాహలం నడుమ బౌడా చైర్మన్ దేవినేని మల్లికార్జునరావు, వైఎస్సార్ సీపీ నాయకుడు వంగవీటి నరేంద్రతో కలసి ఆయన కొల్లూరు గాంధీనగర్‌లో మహిళల ఆశీస్సులు తీసుకొని, ప్రచార వాహనంపై ద్విచక్ర ర్యాలీతో నామినేషన్ దాఖలుకు తరలివెళ్లారు. వైఎస్సార్ సీపీ రీజినల్ కో–ఆర్డినేటర్ ఆళ్ల అయోధ్య రామిరెడ్డి, రాజ్యసభ సభ్యులు మోపిదేవి వెంకట రమణారావు ర్యాలీలో పాల్గొని అశోక్‌బాబుకు సంఘీభావం తెలిపారు. తహసీల్దారు కార్యాలయంలో మధ్యాహ్నం 12.30 గంటలకు ఆయన నామినేషన్ వేశారు. తొలుత కొల్లూరు అనంతభోగేశ్వరాలయం, ఎస్సీ కాలనీలోని పలు చర్చిల్లో వరికూటి సతీమణి లక్ష్మితో కలసి ప్రత్యేక పూజలు, ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం కొల్లూరు విద్యుత్తు సబ్‌స్టేషన్ వద్దనున్న ఇందిరానగర్ ఎస్టీ కాలనీలో మహిళలతో నామినేషన్ పత్రాలకు ప్రత్యేక పూజలు జరిపించారు. ఎస్సీ కాలనీలోని జగ్జీవన్‌రామ్, అంబేడ్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. దారి పొడవునా మహిళలు వైఎస్సార్ సీపీ విజయాన్ని కాంక్షిస్తూ వరికూటికి హారతులు పట్టారు. పూలతో స్వాగతిస్తూ నామినేషన్ దాఖలుకు మద్దతు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కారుమూరు వెంకటరెడ్డి, కొల్లూరు మండల కన్వీనర్ సూర్యదేవర రామకృష్ణ, జెడ్పీటీసీ సభ్యుడు చొప్పర సుబ్బారావు, వైస్ ఎంపీపీ మురాల రాంబాబు, జేసీఎస్ మండల కన్వీనర్ అయిల సుబ్బారావు, మాజీ ఎంపీపీ పెరికల పద్మారావు, వైఎస్సార్ సీపీ నాయకులు ఉప్పు శ్రీనివాసరావు, కూచిపూడి మోషే, చిలకా ప్రకాశం, ఆళ్లమూడి మధు, కమ్మెల సాంబయ్య, నియోజకవర్గంలోని పలు మండలాల నుంచి తరలివచ్చిన ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉలిక్కిపడిన పచ్చ పార్టీ నేతలు

వేమూరులో తెలుగుదేశం పార్టీ ఒక్కసారిగా ఉలిక్కిపడింది. వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి వరికూటి అశోక్‌బాబు నామినేషన్‌కు అంచనాలకు మించి ప్రజలు హాజరు కావడంతో ఉక్కిరిబిక్కిరి అయిపోతున్నారు. ఈనెల 22న పార్టీ అభ్యర్థి నక్కా ఆనంద్‌బాబు నామినేషన్‌కు పట్టుమని నాలుగు వేల మంది కూడా హాజరు కాలేదు. వైఎస్సార్ సీపీ అభ్యర్థి వరికూటి అశోక్‌బాబు నామినేషన్‌కు అంచనాలకు మించి కార్యకర్తలు నాయకులు, మహిళలు స్వచ్ఛందంగా పెద్దఎత్తున హాజరవ్వడంతో ఓటమి భయం వెంటాడుతోంది. ఇప్పటికే తెలుగుదేశం పార్టీ అభ్యర్థి నక్కా ఆనంద్‌బాబు, వివిధ మండలాలకు చెందిన నాయకులు ఇంటింటికీ తిరిగి ఓటు బ్యాంక్ రాజకీయాలు మొదలు పెట్టారు. డబ్బులు ఆశ చూపించి పార్టీలు చేరికలు మొదలు పెట్టారు. వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన పథకాలపై ప్రజల్లో ఆదరణ ఇప్పుడు కళ్లారా కనిపించడంతో తట్టుకోలేకపోతున్నారు. ఒక్క భట్టిప్రోలు మండలం నుంచే నామినేషన్‌కు వేల సంఖ్యలో తరలి రావడంతో ఇప్పుడు తెలుగుదేశం పార్టీ నాయకులు తలలుపట్టుకుంటున్నారు.

వైఎస్సార్ సీపీ జెండా మళ్లీ ఎగర వేస్తాం



వేమూరు తహసీల్దారు కార్యాలయంలో నామినేసన్ వేస్తున్న అశోక్‌బాబు

ధర్మానికీ, అధర్మానికీ, పేదలు, పెత్తందార్లకు మధ్య జరిగే ఎన్నికల పోరాటంలో విజయం సాధిస్తామని వేమూరు ఎమ్మెల్యే అభ్యర్థి వరికూటి అశోక్‌బాబు స్పష్టం చేశారు. సీఎం జగన్ ఐదేళ్ల పాలనలో నవరత్నాల పేరుతో ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని అమలు చేశారన్నారు. ఈ నేపథ్యంలో తాము ఇంటింటికీ వెళ్లి ధర్మంగా ఓటు వేయాలని ప్రజల్ని అభ్యర్థిస్తున్నామని తెలిపారు. ఓటర్ల నుంచి మంచి స్పందన లభిస్తోందని చెప్పారు. ప్రస్తుతం అధికారం కోసం చంద్రబాబు సాధ్యం కాని హామీలతో ప్రజల్ని మభ్య పెడుతున్నారని, ఆయన మాటలు నమ్మేస్థితిలో ఓటర్లు లేరని విమర్శించారు.



ఆకట్టుకున్న ద్విచక్ర వాహన ర్యాలీ



రీజినల్ కో–ఆర్డినేటర్ అయోధ్య రామిరెడ్డితో అశోక్‌బాబు



రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకట రమణారావుతో అశోక్‌బాబు

29న సీఎం వైఎస్ జగన్ పొన్నూరు రాక

పొన్నూరు: ఎన్నికల ప్రచారంలో భాగంగా ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ఈ నెల 29వ తేదీన పొన్నూరు బహిరంగ సభలో పాల్గొననున్నారని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తలశిల రఘురాం గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆ రోజు మధ్యాహ్నం 3 గంటలకు జరిగే సభలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొనాలని కోరారు.

29న ఓటర్ల తుది జాబితా విడుదల



బాపట్ల: ఓటర్ల తుది జాబితా ఈనెల 29న విడుదల చేస్తామని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పి.రంజిత్ బాషా తెలిపారు. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల నాయకులతో గురువారం తన చాంబర్‌లో ఆయన సమావేశమయ్యారు. ఎన్నికలలో పోటీ చేసే అభ్యర్థులకు ఈనెల 29న గుర్తుల్ని కేటాయిస్తామని చెప్పారు. 26న నామినేషన్ పత్రాల పరిశీలన చేస్తామని తెలిపారు. బుధవారం నాటికి పార్లమెంటు, అసెంబ్లీ నియోజవర్గాలకు కలిపి మొత్తం 99 మంది అభ్యర్థులు 147 నామినేషన్లు దాఖలు చేశారని ఆయన వెల్లడించారు. పరిశీలన ముగిసిన తదుపరి నామినేషన్ల ఉపసంహరణ, వెనువెంటనే చిహ్నాల కేటాయింపు ఉంటుందని పేర్కొన్నారు. ఎన్నికల కమిషన్ ఆమోదం తెలిపిన వెంటనే తుది ఓటర్ల జాబితాను ముద్రిస్తామని తెలిపారు. తుది ఓటర్ల జాబితాను గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలకు, ప్రతి పోలింగ్ కేంద్రానికి అందజేస్తామని చెప్పారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి సీహెచ్. సత్తిబాబు, ఎన్నికల విభాగం పర్యవేక్షకులు సీతారామయ్య, వైఎస్సార్ సీపీ నేత ఐ. మాల్యాద్రి, బీజేపీ నేత కె.వి. రామకృష్ణ, బీఎస్పీ నేత కోటేశ్వరరావు, కాంగ్రెస్ పార్టీ నేత డి. రవి, సీపీఎం నేత కోటేశ్వరరావు, ఆమ్ ఆద్మీ నేత ఏ. బాలాజీ రెడ్డి, టీడీపీ నేత షేక్ మహమ్మద్ గౌస్, పాల్గొన్నారు.

ముగిసిన నామినేషన్ల ఘట్టం

- బాపట్ల పార్లమెంట్‌కు 20 మంది నామినేషన్లు
- ఆరు అసెంబ్లీల పరిధిలో 133 మంది దాఖలు
- ప్రధాన పార్టీ అభ్యర్థులతో పాటు నామినేషన్లు వేసిన ఇండిపెండెంట్లు

సాక్షి ప్రతినిధి, బాపట్ల: సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి తొలి ఘట్టమైన నామినేషన్ల ప్రక్రియ గురువారంతో ముగిసింది. ఈనెల 18 నుంచి 25 వరకు నామినేషన్ల దాఖలు కోసం ఎన్నికల కమిషన్ గడువు విధించింది. చివరి రోజు నాటికి బాపట్ల రిజర్వ్‌డ్ పార్లమెంటు స్థానానికి 20 మంది దాఖలు చేశారు. అధికార వైస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా నందిగం సురేష్, టీడీపీ అభ్యర్థిగా తెన్నేటి కృష్ణప్రసాద్, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా మాజీ మంత్రి జేడీ శీలం సహా మరో 20 మంది 34 సెట్లు వేశారు.

అసెంబ్లీకి 133 నామినేషన్లు

- జిల్లాలోని ఆరు అసెంబ్లీ నియోజకవర్గాలకు పెద్ద ఎత్తున నామినేషన్లు దాఖలు అయ్యాయి. చీరాల నుంచి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా కరణం వెంకటేష్, టీడీపీ అభ్యర్థిగా ఎం.ఎం. కొండయ్య, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా ఆమంచి కృష్ణమోహన్‌తో పాటు మొత్తం 24 మంది 39 సెట్లు దాఖలు చేశారు.
- బాపట్ల అసెంబ్లీ నియోజకవర్గం నుంచి అధికార వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా కోన రఘుపతి, టీడీపీ అభ్యర్థిగా వేగేశన నరేంద్రవర్మ, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా గంటా అంజిబాబులతో మొత్తం 31 మంది 46 సెట్లు వేశారు.
- రేపల్లె నియోజకవర్గం నుంచి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా ఈవూరి గణేష్, టీడీపీ అభ్యర్థిగా అనగాని సత్యప్రసాద్, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా మోపిదేవి శ్రీనివాసరావులతో పాటు 19 మంది 34 సెట్లు వేశారు.
- వేమూరు నుంచి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా వరికూటి అశోక్‌బాబు, టీడీపీ అభ్యర్థిగా నక్కా ఆనందబాబు, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా బూర్ల సుబ్బారావుతోపాటు 17 మంది 24 సెట్లు దాఖలు చేశారు.
- పర్చూరు నుంచి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా యడం బాలాజీ, టీడీపీ అభ్యర్థిగా ఏలూరి సాంబశివరావు, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థినిగా ఎన్. శివశ్రీలక్ష్మి జ్యోతితో పాటు మొత్తం 21 మంది 35 సెట్లు వేశారు.
- అద్దంకి నుంచి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పానెం చిన హనిమిరెడ్డి, టీడీపీ అభ్యర్థిగా గొట్టిపాటి రవికుమార్, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా అడుసుమల్లి కిశోర్‌బాబుతో పాటు మొత్తం 21 మంది 36 సెట్లు వేశారు.
- మొత్తంగా ఆరు అసెంబ్లీ నియోజకవర్గాల నుంచి 133 మంది అభ్యర్థులు 215 సెట్ల నామినేషన్లు దాఖలు చేశారు.

తుస్సుమన్న టీడీపీ అభ్యర్థి నామినేషన్

- కానరాని కూటమి నేతలు
- కనిపించని జనం
- పక్క నియోజకవర్గాల నుంచి తెచ్చిన సైనం
- మమ్మల్ని కించపరుస్తున్నారంటూ బీజేపీ, జనసేన నేతల ఆగ్రహం

చీరాల: తెలుగుదేశంతో జత కట్టిన బీజేపీ, జనసేన పార్టీలు రగిలిపోతున్నాయి. పార్టీ కార్యక్రమాల్లో తమకు సరైన స్థానం కల్పించడం లేదని నాయకులు ఆగ్రహంతో ఉన్నారు. చివరికి అవి టీడీపీ అభ్యర్థి నామినేషన్ కార్యక్రమంలో మరింత బహిర్గతమయ్యాయి. చీరాల టీడీపీ అభ్యర్థి ఎం.ఎం. కొండయ్య నామినేషన్ ర్యాలీలో కూటమి పార్టీల నేతలు అరకొరగానే కనిపించారు. గురువారం మండలంలోని దేవాంగపురి హస్తినాపురం నుంచి ప్రారంభమైన నామినేషన్ ర్యాలీలో ఆ పార్టీ జెండాలు మినహా జనసేన, బీజేపీ జెండాలు అరకొరగానే ఉన్నాయి. ర్యాలీకి పక్క నియోజకవర్గాల నుంచి నాయకులు, కార్యకర్తలను తరలించారు. ర్యాలీలో అనుమతి లేకుండా పెద్ద క్రేన్, భారీ వాహనాన్ని వినియోగించడంతో పోలీసులు వాటిని వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ర్యాలీ అనంతరం గడియార స్తంభం సెంటర్‌లో నాయకులు మాట్లాడారు. ప్రచారానికి కొండయ్య అల్లుడు, టాలీవుడ్ హీరో నిఖిల్‌ను తెచ్చుకున్నా ప్రయోజనం లేకపోయిందని ఆ పార్టీ వర్గాలు గుసగుసలాడుతున్నాయి. కార్యక్రమంలో కూటమి పార్టీల నాయకులు మాజీమంత్రి పాలేటి రామారావు, మాజీ ఎమ్మెల్యే బాచిన చెంచుగరటయ్యతో పాటు కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

మెయిన్స్‌లో గుంటూరు మెరుపులు

- జేఈఈ మెయిన్స్‌లో 300 మార్కులు సాధించిన గుంటూరు కుర్రోడు ఎం.జిష్ణుసాయి
- అఖిల భారతస్థాయి ఓపెన్ కేటగిరీలో 18వ ర్యాంకు కైవసం
- ఓపెన్ కేటగిరీలో 36వ ర్యాంకు సాధించిన సాయి యశ్వంత్‌రెడ్డి



జేఈఈ మెయిన్స్ ర్యాంకర్లను అభినందిస్తున్న భాష్యం రామకృష్ణ, ఆనంద్

గుంటూరు ఎడ్యుకేషన్: జేఈఈ మెయిన్స్‌లో గుంటూరు నుంచి ఇద్దరు విద్యార్థులు అఖిల భారత స్థాయి ఓపెన్ కేటగిరీలో టాప్–50లో నిలిచారు. దేశవ్యాప్తంగా 15 లక్షలమంది విద్యార్థులు పోటీ పడిన జేఈఈ మెయిన్స్–2024 ఫలితాల్లో గణిత, భౌతిక, రసాయన శాస్త్రాల వారీగా ప్రతి సబ్జెక్టుల్లో 100కు 100 మార్కులు కైవసం చేసుకున్న విద్యార్థి ఎం.జిష్ణుసాయి 100 పర్సంటైల్‌తో 18వ ర్యాంకు సాధించాడు. గుంటూరులోనే జేఈఈ మెయిన్స్‌కు సన్నద్ధమైన కర్నూలుకు చెందిన మరో విద్యార్థి ఎం.సాయి యశ్వంత్‌రెడ్డి 36వ ర్యాంకు సాధించాడు.

భాష్యంకు టాప్ ర్యాంకులు

జేఈఈ మెయిన్స్–2024 ఫలితాల్లో భాష్యం ఐఐటీ–జేఈఈ అకాడమీ ప్రభంజనం సృష్టించినట్లు భాష్యం విద్యాసంస్థల చైర్మన్ భాష్యం రామకృష్ణ పేర్కొన్నారు. గురువారం చంద్రమౌళీనగర్‌లోని భాష్యం మెయిన్ క్యాంపస్‌లో జరిగిన విద్యార్థుల అభినందన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. తమ విద్యార్థులు అఖిల భారతస్థాయిలో అత్యుత్తమ ర్యాంకులను కైవసం చేసుకున్నారని చెప్పారు. జేఈఈ మెయిన్స్‌లో 300 మార్కులకుగాను 300 సాధించి, 100 పర్సంటైల్ సాధించిన ఎం.జిష్ణుసాయి అఖిల భారతస్థాయి ఓపెన్ కేటగిరీలో 18వ ర్యాంకు కైవసం చేసుకున్నట్లు తెలిపారు. ఎం. సాయి యశ్వంత్‌రెడ్డి సైతం 100 పర్సంటైల్‌తో ఓపెన్ కేటగిరీలో 36వ ర్యాంకు సాధించారని తెలిపారు. వివిధ కేటగిరీల్లో ఎం.సాయి యశ్వంత్‌రెడ్డి 4వ ర్యాంకు, డి. భరత్‌చంద్ర 20వ ర్యాంకు, కేజే వివేక్ 33వ ర్యాంకు, జి. జాన్ 49వ ర్యాంకు, కె. హర్షిత 50వ ర్యాంకు, పి. శ్యామ్ 62వ ర్యాంకు, జె. మణి ప్రదీప్ 69వ ర్యాంకు, కె. చైతన్య 77వ ర్యాంకు, ఎ. గణేష్‌దత్తా 78వ ర్యాంకు, కె. శ్రేయ 82వ ర్యాంకుతో 100 లోపు అత్యుత్తమ ర్యాంకులు దక్కినట్లు వివరించారు. 200లోపు 25, 500లోపు 54, వెయ్యి లోపు 78 ర్యాంకులను సాధించి 71.68 శాతం సక్సెస్ రేట్ సాధించామని పేర్కొన్నారు. ఆలిండియా ర్యాంకులు సాధించిన విద్యార్థులందరూ గుంటూరు కేంద్రంగా పరీక్షలకు సన్నద్ధమై, ర్యాంకులు సాధించిన వారేనని చెప్పారు గతేడాది గుంటూరు నుంచి తొలిసారిగా జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో తమ విద్యార్థులు అఖిల భారతస్థాయిలో 5, 10వ ర్యాంకులు సాధించారని పేర్కొన్నారు. భాష్యంలో అందిస్తున్న పటిష్టమైన ప్రణాళికతో తల్లిదండ్రుల ఆకాంక్షలకు అనుగుణంగా విద్యార్థుల్ని అన్ని పోటీ పరీక్షల్లో టాపర్లుగా తీర్చిదిద్దుతున్నామన్నారు. ఈసందర్భంగా విద్యార్థులకు వారి తల్లిదండ్రులకు, అధ్యాపకులకు అభినందనలు తెలియజేశారు. కార్యక్రమంలో భాష్యం డైరెక్టర్ హనుమంతరావు, ఐఐటీ కో–ఆర్డినేటర్ ఆనంద్ పాల్గొన్నారు.

ఐఐటీలో సీటు సాధించడమే లక్ష్యం

ఎం.జిష్ణుసాయి, 18వ ర్యాంకర్

మా స్వస్థలం గుంటూరు. పదో తరగతి వరకు ఐసీఎస్ఈ సిలబస్‌లో చదివాను. ఇంటర్మీడియెట్ వరకు ఐఐటీకి ఎటువంటి ఫౌండేషన్ లేదు. సీనియర్ ఇంటర్‌లో 969 మార్కులు సాధించాను. రెండేళ్ల ఇంటర్‌తో పాటు ఐఐటీకి ఇచ్చిన శిక్షణతోనే జేఈఈ మెయిన్స్ రాశాను. 300 మార్కులకు 300 మార్కులు సాధించాను. కాలేజీలో డైలీ, వీక్లీ టెస్టులు రాయడం ద్వారా ఎప్పటికప్పుడు పొరపాట్లను దిద్దుకుంటూ వచ్చాను. అధ్యాపకుల సూచనలు పాటించి, సందేహాలను నివృత్తి చేసుకోవడం ద్వారా పూర్తిస్థాయిలో మార్కులు సాధించాను. మే నెలలో జరగనున్న అడ్వాన్స్‌డ్‌పై దృష్టి సారించి, సన్నద్ధమవుతున్నాను. ముంబై ఐఐటీలో సీఎస్ఈ చదవాలనే లక్ష్యంతో ఉన్నాను.

కాలేజీలో ఇచ్చిన ప్లానింగ్ పాటిస్తే చాలు

ఎం.సాయి యశ్వంత్‌రెడ్డి, 36వ ర్యాంకర్

మా స్వస్థలం కర్నూలు. 6వ తరగతి నుంచి గుంటూరులోనే హాస్టల్‌లో ఉండి చదువుకుంటున్నాను. సీనియర్ ఇంటర్‌లో 980 మార్కులు సాధించాను. ఏప్రిల్‌లో రాసిన సెషన్‌లో గణితంలో 100, ఫిజిక్స్‌లో 95, కెమిస్ట్రీలో 90 మార్కులతో 100 పర్సంటైల్ సాధించాను. అడ్వాన్స్‌డ్‌లో టాప్ ర్యాంకు కైవసం చేసుకుని, ముంబై ఐఐటీలో సీఎస్ఈలో సీటు సాధించాలనే ఆశగా ఉంది. కాలేజీలో ఇచ్చిన ప్లానింగ్ ప్రకారం చదువుకుని, డైలీ, వీక్లీ టెస్టులతో ముందుకు వెళ్లడం ద్వారా మంచి మార్కులు స్కోర్ చేయవచ్చు.

ఎన్నికలకు జనరల్ అబ్జర్వర్‌గా ఖాజన్ సింగ్



కారంచేడులో బూత్‌లను పరిశీలిస్తున్న అబ్జర్వర్ ఖాజన్‌సింగ్

ఒంగోలు సబర్బన్: సార్వత్రిక ఎన్నికలు–2024ను పురస్కరించుకొని ప్రకాశం, బాపట్ల జిల్లాల్లోని నాలుగు అసెంబ్లీ నియోజకవర్గాలకు జనరల్ అబ్జర్వర్‌గా ఖాజన్ సింగ్‌ను కేంద్ర ఎన్నికల సంఘం నియమించింది. ఈ మేరకు ఆయన గురువారం ప్రకటన విడుదల చేశారు. ప్రకాశం జిల్లాలోని సంతనూతలపాడు అసెంబ్లీ నియోజకవర్గంతో పాటు బాపట్ల జిల్లాలోని అద్దంకి, పర్చూరు, రేపల్లె అసెంబ్లీ నియోజకవర్గాలకు జనరల్ అబ్జర్వర్‌గా విధుల్లో ఉంటానని పేర్కొన్నారు. తాను చీరాలలోని ఐటీసీ గెస్ట్ హౌస్‌లో ఉంటానని, అభ్యర్థులు, ఆయా పార్టీలకు చెందిన ఏజెంట్లు, ప్రజలు ఏమైనా అభ్యంతరాలు, ఫిర్యాదులుంటే తనను సంప్రదించవచ్చని సూచించారు. ఉదయం 10 గంటల నుంచి అందుబాటులో ఉంటానని, ఫోన్‌లోనైనా సమాచారం చెప్పవచ్చని తెలిపారు. తన ఫోన్ నంబర్ 89853 82855ను సంప్రదించాలని ఆయన కోరారు.

ఎన్నికల నియమావళికి అనుగుణంగా పనిచేయాలి

కారంచేడు: ఎన్నికల నియమావళికి అనుగుణంగా సిబ్బంది పని చేయాలని అద్దంకి, చీరాల, పర్చూరు, రేపల్లే నియోజకవర్గాల ఎన్నికల పరిశీలకుడు ఖాజన్ సింగ్ ఆదేశించారు. గురువారం ఆయన కారంచేడులోని 22, 23 సెక్టార్లలో 170, 171, 173 పోలింగ్ కేంద్రాల్ని తనిఖీ చేశారు. మండలంలో సమస్యాత్మంగా ఉన్న ఎన్నికల బూత్‌ల విషయంలో స్థానిక అధికారులు తీసుకుంటున్న జాగ్రత్తల్ని ఆయన క్షుణ్ణంగా పరిశీలించారు. సాధారణ బూత్‌ల కంటే సమస్యాత్మకంగా ఉన్న వాటిపై ప్రత్యేక దృష్టి పెట్టాలని తెలిపారు. బూత్‌లలో ఇప్పటికే ఏర్పాటు చేసిన వసతుల్ని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఎన్నికల్ని ప్రశాంత వాతావరణంలో నిర్వహించేలా సంబంధిత అధికారులు, సిబ్బంది సమన్వయంగా పని చేయాలని ఆదేశించారు. ప్రధాన పార్టీల మధ్య గొడవలు రెచ్చగొట్టుకొనేలా ఉన్నట్లయితే తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. స్థానిక తహసీల్దార్ బి. మెహర్‌కుమార్, ఎంపీడీవో బి. బాబూరావు, ఎంఆర్ఐ ఎస్.వి. రామారావు, సెక్టార్ ఆఫీసర్లు సీహెచ్. రామచంద్రుడు, కె.సుధీర్‌బాబు, సిబ్బంది పాల్గొన్నారు.

యార్డులో 66,153 బస్తాల మిర్చి విక్రయం



కొరిటిపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు గురువారం 62,762 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ–నామ్ విధానం ద్వారా 66,153 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్–5, 273, 341, 4884, సూపర్–10 రకాల మిర్చి సగటు ధర రూ.8,000 నుంచి రూ.18,000 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.8,000 నుంచి రూ.20,500 వరకు లభించింది. తాలు రకం మిర్చికి రూ.5,000 నుంచి రూ.11,000 వరకు ధర పలికింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 45,199 బస్తాల మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు ఇన్‌చార్జి కార్యదర్శి కాకుమాను శ్రీనివాసరావు తెలిపారు.

క్లుప్తంగా

మినీ ట్రక్ బీభత్సం

- యువకుడు దుర్మరణం
- మరో వ్యక్తికి గాయాలు



మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్సై తిరుపతిరావు

జే.పంగులూరు: బొల్లాపల్లి టోల్ గేట్ సమీపంలోని జాతీయరహదారిపై గురువారం రాత్రి ఓ మినీట్రక్ బీభత్సం సృష్టించింది. రహదారి వెంట నడుచుకుంటూ వెళ్తున్న వ్యక్తులపై దూసుకొచ్చింది. ట్రక్ ఢీకొట్టడంతో ఒకరు అక్కడికక్కడే మృతి చెందగా మరో వ్యక్తి స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. పోలీసుల వివరాల మేరకు.. ముప్పవరం గ్రామానికి చెందిన కొండ్రు జోసఫ్ (23) మార్టూరులో ఓ ప్రైవేటు కాలేజీలో డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ముండ్లమూరు గ్రామానికి చెందిన ప్రవీణ్ తో కలిసి జాతీయ రహదారి వెంబడి ఇద్దరూ నడుచుకుంటూ వస్తున్నారు. ఇంతలో పల్నాడు జిల్లా నూజెండ్ల మండలం కొండలరాయుని పాలెం గ్రామానికి చెందిన షేక్ ఖాశీం తన మినీ ట్రక్‌తో అతివేగంగా ఒంగోలు వైపు వెళ్తున్నాడు. బొల్లాపల్లి టోల్ ప్లాజా దాటిన అనంతరం రోడ్డుపై నడుస్తున్న జోసఫ్, ప్రవీణ్‌ను వెనుకనుంచి బలంగా ఢీ కొంది. ఈ ప్రమాదంలో జోసఫ్ అక్కడికక్కడే మృతి చెందగా ప్రవీణ్‌కు స్వల్ప గాయాలయ్యాయి. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ఎస్సై కేకే తిరుపతిరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నాడు.

కూటమి మాటలు నమ్మొద్దు

- అసెంబ్లీ అభ్యర్థి పానెం చిన హనిమిరెడ్డి విజ్ఞప్తి
- కొత్తరెడ్డిపాలెంలో గడప గడపకు ప్రచారం
- ప్రచార రథంపై మహిళల ఊరేగింపు



అసెంబ్లీ అభ్యర్థి చిన హనిమిరెడ్డి వెంట నడుస్తున్న మహిళలు

అద్దంకి: మీ వద్దకు వస్తోన్న టీడీపీ, జనసేన, బీజేపీ నాయకుల మాటలు నమ్మొద్దు.. వారిది పెత్తందారుల తత్వం.. వారి ఆలోచనంతా స్వపక్షం కోసమే.. వారి దృష్టిలో పేదల బాగోగులకు అసలు స్థానమే లేదని అద్దంకి వైఎస్సార్ సీపీ అసెంబ్లీ అభ్యర్థి పానెం చిన హనిమిరెడ్డి వ్యాఖ్యానించారు. గురువారం కొత్తరెడ్డిపాలెం గ్రామంలో గడప గడపకూ ఎన్నికల ప్రచార కార్యక్రమాన్ని చేపట్టారు. ప్రజలకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చేసిన మేలును గుర్తు చేశారు. అద్దంకి తరపున పోటీ చేసిన తనను, బాపట్ల వైఎస్సార్ సీపీ ఎంపీ అభ్యర్థి నందిగం సురేశ్ కు విజయం అందించాలని కోరారు. ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని ప్రజల్ని అభ్యర్థించారు. ఎన్నికలు సమీపంచే సమయానికి సూపర్ సిక్స్ పథకాల పేరుతో టీడీపీ ప్రచారం చేస్తోన్న తీరుపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. మేనిఫెస్టోను అమలు చేయడం ఆ పార్టీ చరిత్రలో లేదని ఎద్దేవా చేశారు. ఇచ్చిన మాటకు కట్టుబడి ప్రజల కష్టాలను తీర్చిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కావాలా? కల్లబొల్లి కబుర్లతో స్వలాభం కోసం పాకులాడే టీడీపీ కావాలో ప్రజలే తేల్చుకోవాలన్నారు.త్వరలోనే వైఎస్సార్ సీపీ మేనిఫెస్టో ప్రకటించనుందన్నారు. జనరంజకమైన అంశాలు అందులో ఉంటాయన్నారు.



ప్రచార రథంపై జై హనిమిరెడ్డి.. జై జగన్ అంటూ నినదిస్తున్న మహిళలు

ప్రచారం రథంపై మహిళలు..

గ్రామానికి వెళ్లిన హనిమిరెడ్డికి మహిళా మణులు గుమ్మడికాయతో దిష్టి తీసి వెంట నడిచారు. మేం మేవెంటే ఉన్నామంటూ భరోసా నిచ్చారు. మీదే విజయమని ఎమ్మెల్యే అవుతారంటూ ముక్తకంఠంతో దీవించారు. ప్రచారం రథంపైకి ఎక్కి ఫ్యాన్ గుర్తుకే మీ ఓటు అంటూ నినాదాలు చేశారు. హనిమిరెడ్డి వెంట ఆబాల గోపాలం నడిచింది. కార్యక్రమంలో మండల కన్వీనర్ గుజ్జుల జగన్‌మోహన్ రెడ్డి, మండల, గ్రామ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎన్నికల యుద్ధంలో ముందుండి పోరాడాలి



మాట్లాడుతున్న పర్చూరు అసెంబ్లీ అభ్యర్థి యడం బాలాజీ

- కార్యకర్తలు, నాయకులు సైనికుల్లా కదం తొక్కాలి
- ప్రజల్లోకి వెళ్లి..మంచిని వివరించండి
- పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేసిన పర్చూరు వైఎస్సార్ సీపీ అభ్యర్థి యడం బాలాజీ

మార్టూరు: రానున్న ఎన్నికల్లో పెత్తందార్లతో జరుగుతున్న యుద్ధంలో ప్రతి వైఎస్సార్ సీపీ నాయకుడు సైనికుడై పోరాడాలని పర్చూరు నియోజవర్గ అసెంబ్లీ అభ్యర్థి యడం బాలాజీ పిలుపునిచ్చారు. స్థానిక విజయలక్ష్మి కల్యాణ మండపంలో గురువారం నిర్వహించిన పార్టీ నాయకులు కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. నామినేషన్ సందర్భంగా వేలాదిగా పర్చూరుకు తరలి వచ్చి సంఘీభావం తెలిపిన నాయకులు కార్యకర్తలకూ ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఇదే పోరాట పటిమను ఎన్నికల వరకూ కొనసాగిద్దామన్నారు.

ఎగిరేది మనజెండా..ఎప్పుడూ ఉంటుంది నా అండ

పర్చూరు కోటపై వైఎస్సార్ సీపీ జెండా ఎగిరే వరకూ పోరాడాలన్నారు. పర్చూరు బరిలో మనం గెలవబోతున్నామని, విజయానంతరం ప్రతి కార్యకర్తకూ అండగా ఉంటానని బాలాజీ హామీ ఇచ్చారు. ఓటు వేయమనే హక్కు వైఎస్సార్ సీపీకి మాత్రమే ఉందని, గడప గడపకూ వెళ్లి ధైర్యంగా ఓట్లు అడుగుదామని ఆయన పిలుపునిచ్చారు. మన ప్రభుత్వ పథకం అందని గడప..పొందని లబ్ధిదారులు ఎక్కడా లేరన్నారు. ఇవే పథకాలు కొనసాగాలంటే వైఎస్సార్ సీపీకి ఓటు వేసి సీఎంగా జగనన్నను మరోసారి గెలిపిద్దామన్నారు.

దోమలను నిర్మూలించి ఆరోగ్యాన్ని కాపాడుకోండి

ప్రపంచ మలేరియా దినోత్సవ ర్యాలీని ప్రారంభించిన డీఎంహెచ్‌వో



ర్యాలీని పచ్చజెండా ఊపి ప్రారంభిస్తున్న డీఎంహెచ్‌వో డాక్టర్ బి.రవి

నరసరావుపేట : ఇళ్లు, వాటి పరిసరాల్లో దోమలు వృద్ధికాకుండా నీరు నిల్వ ఉండకుండా చేసి ప్రజారోగ్యాన్ని కాపాడుకోవాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి.రవి ప్రజలకు సూచించారు. ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా గురువారం జిల్లా మలేరియా అధికారి కె.రవీంద్ర రత్నాకర్ ఆధ్వర్యంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో పోస్టర్ ఆవిష్కరించి అవగాహన ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇళ్లల్లో వాడని వస్తువుల్లో వారం, అంతకు మించి నీరు నిల్వ ఉండకుండా చేయాలన్నారు. నిల్వ ఉండే మంచినీటిలో దోమ 100 నుంచి 150 గ్రుడ్లు పెడుతుందని, అవి ఏడు నుంచి పదిరోజుల వ్యవధిలో దోమలుగా వృద్ధిచెంది ప్రజలపై దాడి చేస్తాయన్నారు. ఇవి కుట్టడం వల్ల మలేరియాతో పాటు డెంగ్యూ, చికెన్‌గున్యా, బోధకాలు, మెదడువాపు వ్యాధులు వచ్చే అవకాశం ఉందన్నారు. ప్రతి శుక్రవారం ఇళ్ల పరిసరాల్లో నిల్వ ఉన్న నీటిని తొలగించడం ద్వారా వ్యాధులను నివారించవచ్చన్నారు. ర్యాలీలో పాల్గొన్న పీహెచ్‌సీ వైద్యులు, ఏఎన్ఎంలు, ఆషా కార్యకర్తలు దోమలు నిర్మూలిద్దాం-వాటి ద్వారా వచ్చే వ్యాధులను అరికడదాం వంటి నినాదాలు చేస్తూ ప్రజలకు అవగాహన కల్పిస్తూ ర్యాలీ కొనసాగింది. డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ హనుమకుమార్, పీఎండీవో రామకృష్ణ, సీహెచ్‌వోలు రామకృష్ణ, సుబ్బారెడ్డి, సీహెచ్.వెంకటేశ్వర్లు, కె.శ్రీనివాసరావు, కె.సాంబశివరావు పాల్గొన్నారు.

'నవ' భారతం పుస్తకానువాదం అభినందనీయం



నగరంపాలెం (గుంటూరు వెస్ట్): అష్ట వంకరల 'నవ' భారతం పేరుతో ముద్రించిన పుస్తకం తెలుగులో అనువదించం అభినందనీయమని ఉమ్మడి హైకోర్టు విశ్రాంత జస్టిస్ కేజీ.శంకర్ అన్నారు. గుంటూరు బుక్ రీడర్స్ క్లబ్ ఆధ్వర్యంలో డాక్టర్ పరకాల ప్రభాకర్ రచించిన అష్ట వంకరల 'నవ' భారతం (సంక్షోభంలో గణతంత్ర వ్యవస్థ) పుస్తక పరిచయ సభ గురువారం రాత్రి గుంటూరు బ్రాడీపేటలోని యూటీఎఫ్ హాల్‌లో జరిగింది. సభకు ఏపీ మెడికల్ / సేల్స్ రిప్రజెంటేటివ్ రాష్ట్ర అధ్యక్షుడు కుమార్ అధ్యక్షత వహించి, మాట్లాడారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన విశ్రాంత జస్టిస్ శంకర్ మాట్లాడుతూ ఈ పుస్తకంలో ప్రజాస్వామ్య వ్యవస్థపై పలు అంశాలను ప్రస్తావించారని పేర్కొన్నారు. ఎన్నికలకు కులంతో సంబంధం లేదని, కొన్ని పార్టీలు హిందూత్వమని వ్యాఖ్యానించడం సరికాదన్నారు. ప్రతి ఒక్కరూ పుస్తకం చదవాలని, ఒక గైడ్‌గా ఉపయోగపడనుందని చెప్పారు. ఎమ్మెల్సీ కె.ఎస్.లక్ష్మణరావు మాట్లాడుతూ గత పదేళ్లల్లో మోదీ నాయకత్వంలో బీజేపీ అనుసరిస్తోన్న విధానాలకు ప్రతిబింబంగా అష్ట వంకరల నవభారతం పుస్తకం ఉందని, గణాంకాలు, ఆధారాలతో సహా ముద్రించారని పేర్కొన్నారు.

కరణం వెంకటేశ్ కు రెడ్డి జేఏసీ మద్దతు

వెంకటేశ్ విజయానికి కృషి చేస్తాం : రాష్ట్ర రెడ్డి బాపట్ల జిల్లా జేఏసీ అధ్యక్షుడు 'ఆట్ల'



కరణం వెంకటేశ్ కు మద్దతు ప్రకటిస్తున్న రెడ్డి జేఏసీ జిల్లా అధ్యక్షులు, ప్రతినిధులు

చీరాల: చీరాల వైఎస్సార్ సీపీ అభ్యర్థి కరణం వెంకటేశ్ ను గెలిపించేందుకు శక్తివంచనలేకుండా కృషి చేస్తామని, చీరాలలో పార్టీ జెండాను ఎగరేసేందుకు సైనికుల్లా పనిచేస్తామని రాష్ట్ర రెడ్డి బాపట్ల జిల్లా జేఏసీ అధ్యక్షులు ఆట్ల సుబ్బారెడ్డి అన్నారు. గురువారం రామకృష్ణాపురంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గ వైఎస్సార్ సీపీ అసెంబ్లీ అభ్యర్థి కరణం వెంకటేష్ ను సుబ్బారెడ్డి మర్యాద పూర్వకంగా కలిసారు. తమ సంపూర్ణ మద్దతును ప్రకటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రజల సంక్షేమం, అభివృద్ధికి అధిక ప్రాధాన్యమిస్తున్న సీఎం జగనన్నను మళ్లీ సీఎంగా, చీరాల ఎమ్మెల్యేగా కరణం వెంకటేశ్ ను అధిక మెజార్టీతో గెలిపించేందుకు సమష్టిగా కృషి చేస్తామన్నారు. అనంతరం ఎమ్మెల్యే అభ్యర్థి కరణం వెంకటేశ్ మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సంక్షేమ పథకాలు ప్రతి ఇంటికి చేరువయ్యాయన్నారు. సంక్షేమం కొనసాగాలంటే మరోసారి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి కావాల్సిన అవసరం ఎంతో ఉందన్నారు. మే 13న జరిగే సార్వత్రిక ఎన్నికలలో చీరాలలో వైఎస్సార్ సీపీ జెండా ఎగురుతుందన్నారు. అందుకు అందరూ కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో సంఘ ప్రతినిధులు యాట్రా శేఖర్‌రెడ్డి, కె.ప్రసాద్‌రెడ్డి, అక్కల శ్రీనివాసరెడ్డి, అక్కల రాజశేఖర్‌రెడ్డి, ఆసాది శ్రీనివాసరెడ్డి, మున్సిపల్ చైర్మన్ జంజనం శ్రీనివాసరావు, పార్టీ పట్టణాధ్యక్షుడు కె.బాబ్జి, తదితరులు ఉన్నారు.

ఎన్నికల పరిశీలకుడితో జిల్లా ఎస్పీ భేటీ

నగరంపాలెం: జిల్లాలోని తెనాలి, పొన్నూరు, మంగళగిరి అసెంబ్లీ నియోజకవర్గాల జనరల్ ఎన్నికల పరిశీలకునిగా నియ మితులైన హిమాచల్‌ప్రదేశ్ ఐఏఎస్ అధికారి నీరజ్‌కుమార్ గురువారం జిల్లా పోలీస్ కార్యాలయానికి విచ్చేశారు. ఈ మేరకు ఆయన్ను జిల్లా ఎస్పీ తుషార్ డూడీ మర్యాద పూర్వకంగా కలిశారు. త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల దృష్ట్యా శాంతి, భద్రతల సమస్యలు తలెత్తకుండా ప్రశాంతమైన వాతావరణంలో ఎన్నికలు నిర్వహణకు జిల్లా పోలీస్ శాఖ చేపట్టిన ముందస్తు చర్యలను ఆయన దృష్టికి జిల్లా ఎస్పీ తీసుకొచ్చారు. పోలింగ్ స్టేషన్‌ల వద్ద కట్టుదిట్టమైన భద్రత చర్యలు, అక్రమ మద్యం, నగదు, ఇతరత్రా వస్తువుల అక్రమ రవాణాను కట్టడి చేసేందుకు అమలు చేస్తున్న చర్యల పైనా కూలంకషంగా వివరించారు.

ఆఖరి రోజున 12 నామినేషన్లు స్వీకరణ

చీరాల టౌన్: నామినేషన్ల స్వీకరణలో ఆఖరి రోజైన గురువారం 12 మంది అభ్యర్థులు తమ అభ్యర్థిత్వ పత్రాలను దాఖలు చేశారని నియోజకవర్గ ఎన్నికల అధికారి జి.సూర్యనారాయణరెడ్డి తెలిపారు. స్థానిక ఆర్డీవో కార్యాలయంలో టీడీపీ అభ్యర్థిగా ఎంఎం. కొండయ్య, కాంగ్రెస్ తరపున ఆమంచి కృష్ణమోహన్, ఆమంచి సుజాత నామినేషన్లు వేశారు. శీలం రవికుమార్ (లిబరేషన్ పార్టీ అభ్యర్థి),షేక్అబ్దుల్ బషీర్ (ఇండియన్ యూనియన్ ముస్లిం లీగ్), జంజనం కృష్ణ (తెలుగు రాజాధికార సమితి పార్టీ), చెన్నుపల్లి పవన్‌కుమార్ (ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ) నామపత్రాలను అందించారు. అలాగే స్వతంత్ర అభ్యర్థులుగా పావులూరి రవీంద్రబాబు, దేవరపల్లి రంగారావు, గోచిపాతల రమేశ్ బాబు, అంబటి పుష్పరాజ్ తమ అభ్యర్థిత్వాలను అందించినట్లు రిటర్నింగ్ అధికారి వివరించారు.

బాపట్ల నియోజకవర్గంలో 47నామినేషన్లు

బాపట్ల బాపట్ల నియోజకవర్గంలో 31మంది 47 నామినేషన్లు వేసారని ఎన్నికల రిటర్నింగ్ అధికారి, జాయింట్ కలెక్టర్ చామకూరి శ్రీధర్ తెలిపారు. తహసీల్దార్ కార్యాలయంలో ఆయన వివరాలను వెల్లడించారు. ఈనెల 18 నుంచి 25 వరకు జరిగిన ఈ ప్రక్రియలో మొత్తం 47 నామినేషన్లు నమోదయ్యాయన్నారు. చివరి రోజైన గురువారం 19మంది నామినేషన్లు వేశారన్నారు. నామపత్రాల పరిశీలన 26న ఉంటుందన్నారు. వైఎస్సార్‌సీపీ నుంచి ఎమ్మెల్యే కోన రఘుపతి, టీడీపీ తరపున వేగేశన నరేంద్రవర్మరాజు, కాంగ్రెస్ నుంచి గంటా అంజిబాబు నామినేషన్లు వేశారు. తుది జాబితా ఈనెల 29న ప్రకటిస్తామని ఆయన తెలిపారు.

సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక దృష్టి

ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి



రెంటాలలో పోలింగ్ బూత్‌లను పరిశీలించి పరిస్థితులను తెలుసుకుంటున్న ఐజీ

రెంటచింతల: సమస్యాత్మకమైన గ్రామాలపై ప్రత్యేక దృష్టి పెట్టినట్లు ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి తెలిపారు.గురువారం ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి ఆకస్మికంగా రెంటాల గ్రామంలోని 239, 240, 241, 242 పోలింగ్ బూత్‌లను పరిశీలించి మాట్లాడారు. ఏర్పాటు చేసిన వెబ్ సీసీ కెమెరాల పనితీరు ఎలా ఉందని ప్రశ్నించారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ ప్రశాంత వాతావరణంలో ఎవరి ఓటు వారు హక్కును సద్వినియోగం చేసుకోవడానికి స్వేచ్ఛ కల్పించాల్సిన బాధ్యత మనదేనన్నారు. మండలంలో సమస్యాత్మక గ్రామాలు ఎన్ని ఉన్నాయి. ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు తీసుకున్నారు. ఓటర్లలో మనం పూర్తి మనోధైర్యం కల్పించాలన్నారు. రెంటచింతల మండలంలోని రెంటాల గ్రామం పరిస్థితి ఏమిటి..ఇక్కడ ఓటర్లు ఎంతమంది ఉన్నారు.. పోలింగ్ ఎలా జరుగుతుంది..పోలింగ్ శాతం ఎంతవరకు ఉంటుంది..ఎన్నికల సమయాల్లో ఇక్కడ ఎలాంటి పరిస్థితులు ఉంటాయి..ఎందుకు సమస్యాత్మ కమైన గ్రామం అని ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి పోలీసు అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మంచికల్లు గ్రామాలలోని 243, 244, 245, 246 పోలింగ్ బూత్‌లను కూడ సందర్శించి పరిశీలించి గ్రామస్తులతో మాట్లాడారు. చట్టం దృష్టిలో అందరూ సమానమేనని గుర్తుంచుకోవాలని ఓటర్లకు రక్షణ కల్పించడమే పోలీసుల లక్ష్యమన్నారు. ప్రజలు ధైర్యంగా వారి ఓటు వేసుకునేలా చర్యలు చేపట్టినట్లు చెప్పారు. సమస్యాత్మకమైన పోలింగ్ స్టేషన్ల వద్ద ప్రత్యేక దళాలతో భద్రతా ఏర్పాట్లు చేస్తామన్నారు. ఓటర్లను ప్రలోభ పెట్టినా, భయందోళనకు గురి చేసినా, వారి ఓటు హక్కుకు భంగం కలిగించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వారి వెంట గురజాల డీఎస్పీ పల్లపురాజు, ఎస్ఐ కె. వెంకట నారాయణరెడ్డి తదితరులున్నారు.

కుమారుడు డబ్బులు పంపలేదని తల్లి బలవన్మరణం

గణపవరం రాజీవ్‌గాంధీకాలనీలో విషాద సంఘటన



మండల లక్ష్మీదేవి మృతదేహం

నాదెండ్ల: పనికి వెళ్ళిన కుమారుడు సరిపడా డబ్బులు పంపలేదనే మనస్తాపంతో తల్లి బలవన్మరణానికి పాల్పడిన సంఘటన గణపవరం రాజీవ్‌గాంధీకాలనీలో చోటు చేసుకుంది. నాదెండ్ల ఎస్సై జె బలరామ్‌రెడ్డి తెలిపిన వివరాల మేరకు మండల లక్ష్మీదేవి (36) రాజీవ్‌గాంధీకాలనీలో నివాసం ఉంటుంది. మృతురాలి భర్త రాముడు ఏడాది క్రితం రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. ఏకైక కుమారుడు శివరామ్‌తో కలిసి అద్దె ఇంట్లో నివసిస్తున్నారు. కుమారుడు శివరామ్ పది రోజుల క్రితం రేకులు కప్పే పని ఒప్పుకుని నెల్లూరుకు వెళ్ళాడు. బుధవారం ఉదయం లక్ష్మీదేవి ఇంటి ఖర్చుల కోసం డబ్బులు కావాలని కుమారునికి ఫోన్‌చేసి అడగడంతో వెయ్యి రూపాయలు మాత్రమే పంపాడు. తనకు ఇవి సరిపోవని, మరికొంత పంపాలని, లేదంటే తాను ఆత్మహత్య చేసుకుంటానని బెదిరించింది. ఆపై ఎలుకల మందు తిని అపస్మారక స్థితిలో పడిపోయింది. స్థానికులు గమనించి ఆమెను ఆటోలో చిలకలూరిపేట ఏరియా ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం గుంటూరు జీజీహెచ్‌కు తరలించారు. చికిత్స పొందుతూ గురువారం ఉదయం 6.15 గంటలకు మృతి చెందింది. లక్ష్మీదేవి బంధువైన నాగజ్యోతి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రెండు చెక్‌పోస్టుల్లో రూ.3.19 లక్షల నగదు స్వాధీనం

చిలకలూరిపేట టౌన్: ఎన్నికల తనిఖీల్లో భాగంగా రెండు చెక్‌పోస్టుల వద్ద ఎలాంటి ఆధారాలు లేకుండా తరలిస్తున్న రూ.3.19 లక్షల నగదును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. గురువారం మండలం పరిధిలోని ఈటీ చెక్‌పోస్టు వద్ద రూ.1.50 లక్ష నగదును చిలకలూరిపేట ఫ్లయింగ్ స్క్వాడ్ టీం అధికారులు తమ సోదాల్లో పట్టుకోగా, బొప్పూడి చెక్‌పోస్టు వద్ద ఉన్న ఎస్ఎస్‌టీమ్ అధికారులు రూ.1.69 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు.

అన్నీ తానై తనయుడిని తీర్చిదిద్దిన అమ్మ

- పుట్టుకతోనే బుద్ధి మాంద్యంతో బాధపడుతున్న మాధవ అఖిలేష్
- పది పరీక్షల్లో 456 మార్కులు
- సాధారణ విద్యార్థులతో పోటీ పడి ఉత్తీర్ణత
- విద్యాబోధన చేసిన మాతృమూర్తి
- ఇంట్లో ఉపాధ్యాయినిగా ఉంటూ పీహెచ్‌డీ చేస్తున్న అమరేశ్వరి



తల్లిదండ్రులు అమరేశ్వరి, రాముతో మాధవ అఖిలేష్

గుంటూరు ఎడ్యుకేషన్: ఒక తల్లిగా బిడ్డకు జన్మనివ్వడమే కాకుండా బిడ్డ కోసం ఎన్నో త్యాగాలు చేసింది ఆ మాతృమూర్తి. జీవితంలో ఉన్నతస్థాయిలో స్థిరపడే అవకాశాలను వదులుకుని అనుక్షణం తనయుడి కోసం తపిస్తోంది. పుట్టుకతోనే బుద్ధి మాంద్యం (ఆటిజం) సమస్యతో ఉన్న తనయుడికి పాఠశాలలో ఉపాధ్యాయులు చెప్పే పాఠ్యాంశాలకు మించి, ఇంట్లో తానే ఒక గురువుగా మారి తనయుడిని విద్యావంతుడిగా తీర్చిదిద్దింది. వివరాలు.. గుంటూరులోని సాయిబాబా రోడ్డుకు చెందిన తాయా మాధవ వెంకట సాయి జగన్ అఖిలేష్ భాష్యం హైస్కూల్లో చదివి, ఇటీవల విడుదలైన పదో తరగతి పరీక్ష ఫలితాల్లో 600 మార్కులకు 456 సాధించాడు. విద్యార్థి తల్లిదండ్రులు అమరేశ్వరి, రాము. దాచేపల్లిలో నివాసముంటున్న సమయంలో 2011లో నాలుగేళ్ల వయసులో వీరి తనయుడు మాధవ అఖిలేష్ మాటలు సక్రమంగా మాట్లాడకపోవడం, ప్రవర్తనలో మార్పు గమనించారు. గుంటూరు తీసుకొచ్చి వైద్యులకు చూపించగా, ఆటిజం అని నిర్ధారించారు. ప్రత్యేక పాఠశాలలో చేర్పించి శిక్షణ ఇప్పించడం ద్వారా కొంత ప్రయోజనం ఉంటుందని చెప్పడంతో కుమారుడి కోసం అప్పట్లో దాచేపల్లి నుంచి కుటుంబంతో సహా గుంటూరు వచ్చారు. గుంటూరులో ప్రత్యేక అవసరాలు గల పిల్లల పాఠశాలల్లో చేర్పించి, నాలుగేళ్లపాటు శిక్షణ ఇప్పించారు. తరువాత ఒకటో తరగతి నుంచి 5వ తరగతి వరకు వివిధ పాఠశాలల్లో తోటి విద్యార్థులతో పాటు సాధారణ విద్యార్థిగా చేర్పించి, చదువు చెప్పించారు. ఎమ్మెస్సీ బీఈడీ(భౌతికశాస్త్రం) చదివిన విద్యార్థి తల్లి అమరేశ్వరి ప్రభుత్వశాఖల్లో ఉద్యోగం కోసం పోటీ పరీక్షలకు సన్నద్ధమైనప్పటికీ, తనయుడిని చూసుకునేందుకు ఆ ప్రయత్నానికి స్వస్తి పలికారు. తండ్రి రాము ఫ్లిప్‌కార్ట్‌లో డెలివరీ అసోసియేట్‌గా పని చేస్తున్నారు. 6వ తరగతి నుంచి భాష్యం హైస్కూల్లో చేర్పించారు. పాఠశాలలో ఉపాధ్యాయులు చెప్పిన పాఠ్యాంశాలను వినడం మినహా, తిరిగి మాట్లాడటం, ఉపాధ్యాయులు అడిగే ప్రశ్నలకు సమాధానాలవ్వడం వంటివి మాధవ్ అఖిలేష్ చేయలేడు. దీంతో పాటు ఆటిజం సమస్యతో బాధ పడుతున్న వాళ్లు సమూహంలో ఉండటం కంటే ఒంటరిగా ఉండేందుకే ఇష్టపడతారు. పాఠశాలలో ఉపాధ్యాయులు ఎంత చెప్పినా, ఇంట్లో ఉపాధ్యాయురాలిగా, స్నేహితురాలిగా వ్యక్తిగత శ్రద్ధ తీసుకుని విద్యార్థి తల్లి అమరేశ్వరి పోషించిన పాత్ర వలనే పదో తరగతి పబ్లిక్ పరీక్షలను ధైర్యంగా ఎదుర్కొన్నాడు. ప్రస్తుతం విద్యార్థికి 17 ఏళ్లు. టెన్త్‌లో సాధారణ విద్యార్థులతో పోటీపడి ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణత సాధించాడు. కాగా విద్యార్థి తల్లి ఇంటి వద్ద ట్యూషన్లు చెప్పుకుంటూ, ఏఎన్‌యూలో పీహెచ్‌డీ తృతీయ సంవత్సరం చదువుతున్నారు. బీఈడీ పూర్తి చేయడంతో పాటు సైన్స్ సబ్జెక్టు కావడంతో కుమారుడికి ఇంట్లోనే విద్యాబోధన చేసింది. అన్నీ తానై చూసుకుని తనయుడిని తీర్చిదిద్దిన అమరేశ్వరిని పాఠశాల యాజమాన్యంతో పాటు స్థానికులు అభినందించారు.

ద్విచక్ర వాహనం దహనం

వెల్దుర్తి : మండలంలోని గుండ్లపాడు గ్రామంలో బుధవారం అర్ధరాత్రి ఓ ద్విచక్ర వాహనాన్ని వరిచెత్త వేసి దగ్ధం చేసిన సంఘటన జరిగింది. గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త దేరంగుల వెంకటేష్ తన ద్విచక్ర వాహనాన్ని ఇంటి ముందు పెట్టుకొని నిద్రపోతున్న సమయంలో ఆయన బావ టీడీపీ కార్యకర్త నాగమల్లయ్య ద్విచక్ర వాహనం పై వరిగడ్డి వేసి నిప్పు పెట్టడంతో వాహనం కాలిపోయింది. వాహనం పై మంటలు ఎగసిపడుతుండటంతో వెంకటేష్ బయటకు వచ్చి వాహనం పై నీళ్ళు మంటలు ఆర్పాడు. వెంకటేష్ ఫిర్యాదు మేరకు ఎస్ఐ ఈ శ్రీహరి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.